ఈమహావార్ధిలో నీదులాడెడు నౌక
ఏ మహావాయువు నెనయకెట్లుండునో
ఈనౌక సౌందర్య మింతింత యనరాక
నానేత్రయుగము నానందంబునఁ ముంచె.

హాల్వీ (ప్రవేశించి)

బిడ్డా! ఏమిచేయుచుంటివి?

అనార్కాళి

చిన్నప్పుడు తమరు నేర్పినగీతము నొక ధానిని పాడుకొనుచుంటిని.

హాల్వీ

ఇప్పు డెందుకు?

అనార్కాళి

రాత్రికి పాడవలయునుగదా!

హాల్వీ

ఏమి టాగీతము.

అనార్కాళి

(పాడును)

హాల్వీ

అకాలమున నీ కీసంగీత మెందుకు?

అనార్కాళి

నేను నేడేలనో సంగీతము పాడకుండ నూరకుండ లేకున్నాను.

హాల్వీ

బిడ్డా! దయ యుంచి మానివేయుము.

అనార్కాళి

స్వామీ! నాచేత కాదు.

హాల్వీ

నేను వెళ్లుచున్నాను.

అనార్కాళి

గురూ! నాకు చదువుచెప్పిన ఉస్తాదువు. పెండ్లి చేసినహాల్వీవి. నన్ను వదలిపెట్టి వెళ్లెదవా?
ఈ మహానౌక ఝంఝామారుతముచేసి
ఈ మహాంబుధిలోన నెచటమున్గునొకదా
అరయ రమ్యంబు లీతెరచాప లే గాలి
చిఱిగిపోవునొ నాదుచిత్తమ్ము తపియించు
ఔను చూచుచుటకు మహారమ్యమైనట్టి
ఈనౌకసైతమ్ము తానెట్లు మునుగునో?
ఆరంభ మేవస్తువైనపొందెన యేని
నూరసినఁ దాని కంతమ్ము నున్నది.

[హాల్వీ నిష్క్రమణము]

అనార్కాళి

మాగురువుగారు వెళ్లినారు.
బానిస నగునేను భారత సామ్రాట్టు
రాణివాసమున కైనాను చోద్యము చూడు
ఉప్పుసంద్రంబున నుద్భవించినముత్య
మప్పార్థివుని కిరీటాంచలంబున నుండె.

సలీము

(ప్రవేశించును)

అనార్కాళి

(చూడక)

లేగదూడలుగూడ తూగి వాంఛించని
యాగడ్డిపోచ వాహినిలోన బడిపోయి
ముఖరించు నీమహాంభోరాశి తరగల
శిఖరడిండీరలక్ష్మీమనోజ్ఞతదాల్చె.

సలీము

ఏమిటిపాడుచుంటివి?

